
నారపల్లిలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి


పీర్జాదిగూడలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల ర్యాలీలో మంత్రి మల్లారెడ్డి

కాంగ్రెస్ అంటే కరువు, స్కాములు


నాగారం మున్సిపాలిటీలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో సత్యంసాగర్, నాయకులు


బోడుప్పల్‌లో సీనియర్ సిటిజన్ ఆత్మీయ సమ్మేళనంలో..

మేడ్చల్ జోన్ బృందం: కాంగ్రెస్ పార్టీ అంటే కరువు, స్కాములు మాత్రమే గుర్తుకు వస్తాయని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన సీనియర్ సిటిజన్స్, ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలో యాదవ సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు గాలి ఎక్కడిది.. ఎందుకొస్తది అని ప్రశ్నించారు. నిబద్ధతతో పనిచేసిన బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కడతారన్నారు.

ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది..

రాష్ట్రాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. సొంత పైసలతో మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, కొంత మంది వ్యక్తులు ప్యాకేజీకి ఆశపడి ఇతర పార్టీల్లో చేరినా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. ప్రజలను ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మంత్రి తనయుడు భద్రారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్..

ఎన్నో మంచి పనులు చేపట్టి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో తెలంగాణ సగర సంగం ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సాగర్ సుమారు 100 మందితో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పోచారం మున్సిపాలిటీ చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్లు మల్లేశ్‌యాదవ్, రెడ్యానాయక్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్టెప్పులేసిన మంత్రి మల్లారెడ్డి..

బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, నాయకులతో కలిసి స్టెప్పులేసి అందరినీ ఆకట్టుకున్నారు. మరోవైపు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శామీర్‌పేట్ మండలంలోని యాడారం, మురహరిపల్లి గ్రామాల్లో మంత్రి కోడలు శాలినీరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.


మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్


దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్నర్ మీటింగ్‌లో భారీగా ప్రజలు

మల్లారెడ్డికి ఓటమి భయం

- మేడ్చల్ ప్రజానీకమంతా కాంగ్రెస్‌వైపే..
- మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్
- శామీర్‌పేటలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

మేడ్చల్ జోన్ బృందం: సమస్యలను గాలికి వదిలి.. మంత్రి మల్లారెడ్డి తన ఆస్తులను పెంచుకున్నాడని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులతో పాటు, భవానీనగర్, అహ్మద్‌గూడ, ఆర్‌జీకే, కుందన్‌పల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర నేత నక్కా ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ ప్రజలకు పెనుశాపంగా మారిన జవహర్‌నగర్ చెత్తడంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించడంలో మంత్రి మల్లారెడ్డి పూర్తిగా విఫలం అయ్యాడన్నారు. వర్షకాలంలో డంపింగ్ యార్డు వ్యర్థ జలాలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, అయినా సమస్యను పాలకులు పరిష్కరించలేదని అసహనం వ్యక్తం చేశారు.

◆ డంపింగ్ యార్డు సమస్యపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసి పోరాటం చేస్తున్నారని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెత్త డంపింగ్ యార్డును నగరానికి నాలుగు వైపులా తరలిస్తామన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి భూదందాలు చేస్తూ కోట్లు సంపాదించాడే తప్ప ఇక్కడి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు.

◆ ఇక్కడి ప్రజల్లో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, బీసీబంధు ఇవ్వలేదని, భవానీనగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయడం చేతకాని మంత్రికి గుణపాఠం చెప్పాలన్నారు. నియోజవకర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి మంత్రి మల్లారెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు.

బీఆర్ఎస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు

బీఆర్ఎస్ పాలనతో ప్రజలంతా విసిగు చెందిపోయారని, ఇప్పుడు ఎక్కడ చూసిన కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. కాంగ్రెస్ గెలుపొందడం ఖాయం అన్నారు. మున్సిపాలిటీల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు. దమ్మాయిగూడలో మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వజ్రేష్‌యాదవ్ ప్రారంభించారు. కాంగ్రెస్ నేతలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్ప రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు గోగుల సరితావెంకటేష్, వరగంటి వెంకటేష్, మాజీ సర్పంచ్ రామారం వెంకటేష్, నేతలు ప్రసాద్‌గౌడ్ సంజీవరెడ్డి, మొర్గు సునితాచంద్రమోహన్, శోభారాణి, శ్రీకాంత్‌రెడ్డి, సోమేష్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


భవానీనగర్‌కాలనీలో కాంగ్రెస్ నేత వజ్రేష్‌యాదవ్


ఎన్నికల ప్రచారంలో వజ్రేష్‌యాదవ్, మహిళా కార్యకర్తలు

బీఆర్ఎస్‌కు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజీనామా



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల రైతు సహకార సంఘం చైర్మన్, సీనియర్ నాయకుడు ఎస్.రాంరెడ్డి శనివారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. అనివార్య కారణాల వల్ల బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చెప్పారు. శ్రేయోభిలాషులతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లో శనివారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ సి.మల్లేష్ ప్రారంభించారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలంటూ వలంటీర్లు నినాదాలు చేశారు. ఓటు విలువ గురించి బ్యానర్ల ద్వారా తెలియజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు నీలిమ హాస్పిటల్ వైద్య బృందం శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయండి

- మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి
- మేడ్చల్‌లో పోలీసు కవాతు


మేడ్చల్‌లో ఫ్లాగ్‌మార్చ్‌లో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ, పోలీస్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: 30న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి మేడ్చల్ పట్టణంలో మేడ్చల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డితో కలిసి పాల్గొన్న ఏసీపీ ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించారు. ప్రధాన కూడళ్ల వద్ద యువకులు, ప్రజలతో మాట్లాడి ఓటును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ డీఐ ప్రసాద్, ఎస్ఐ నవీన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, నర్సింహగౌడ్, లావణ్య, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

అల్వాల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని హెలెన్ కెల్లర్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్, చైర్మన్ పఠాన్ ఉమర్‌ఖాన్ అన్నారు. శనివారం నేరేడ్‌మెట్‌లోని బ్యాంక్ కాలనీ రామకృష్ణపురంలో ఉన్న హెలెన్ కెల్లర్ ఇనిస్టిట్యూట్‌లో డిగ్రీ కాలేజ్, బీకాం విద్యార్థులు కొత్తగా బీకాంలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమర్‌ఖాన్‌తో పాటు ప్రమీల ఖాన్, డిగ్రీ ప్రిన్సిపల్ జే.అంజయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న రంగ్ మంచ్

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ స్కూల్లో శనివారం రంగ్‌మంచ్ కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏరోబిక్స్, శాస్త్రీయ నృత్యం, రైతు గొప్పదనంపై నాటికలను వేశారు. కార్యక్రమంలో కోర్ హెడ్ ఆపరేషన్ కిషోర్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమామీనన్, స్వర్ణ, మణికంఠ, రమ్య, జానకీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

నోడల్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో సంబంధిత ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి జిల్లా నోడల్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో అక్రమంగా నగదు పంపిణీ, మద్యం, డ్రగ్స్ వంటి ఇల్లీగల్ కార్యక్రమాలు జరగకుండా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు ఇప్పటి వరకు చేసిన కేసులు, పనులకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలో వ్యయపరిశీలకుల బృందంలో తీసుకున్న చర్యలపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. సీ–విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 229 ఫిర్యాదులు రాగా వాటికి సంబంధించి సమస్యలను పరిష్కరించామన్నారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కి వచ్చిన ఫిర్యాదులు, ఫోన్ కాల్స్‌పై పూర్తి సమాచారాన్ని సేకరించారు. స్వీప్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఓటర్ల అవగాహన, ఓటు ప్రాముఖ్యతపై ప్రచారం చేస్తున్నామన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబరుకు 2,419 కాల్స్ వచ్చినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో వంద శాతం పోలింగ్ జరిగేలా అన్ని రకాల చర్యలు చేపట్టడంతోపాటు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.



ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సాయిధరణి కాలనీలో నివాసం ఉంటున్న సున్నం శ్రీనివాస్ కుమారుడు సాయివర్ధన్ ప్రమాదవశాత్తు దీపావళి రోజున గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శనివారం బాలుడి వైద్యఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌పరిధిలో ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు.

ప్రపంచ కప్ భారత్‌దే..

అల్వాల్: ప్రపంచ కప్‌లో భారత క్రికెట్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ అల్వాల్ త్రివేణి స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీసుధా మాట్లాడుతూ ఇండియన్ టీం ప్రపంచ కప్ గెలవాలని 140 కోట్ల మంది భారతీయులు ఎదురు చూస్తున్నారన్నారు. సీఎస్ఓ సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్రావు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై ఎడ్యుకేషన్ ఫెయిర్


ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో విదేశీ ప్రతినిధులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. వాల్మీకి గ్రూప్ పోస్టరింగ్ ఎక్సలెన్స్ సహకారంతో కళాశాలలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో 18 దేశాలకు చెందిన యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు 50కి పైగా యూనివర్సిటీల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు గల అవకాశాలు, సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి వారికి విదేశీ విద్యపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొన్న విదేశీ ప్రతినిధులను కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీలత సత్కరించారు. వాల్మీకి గ్రూప్ సీఈఓ నిరుపమ, కళాశాల సెక్రటరీ టీవీరెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏవో హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


మల్లారెడ్డి మహిళా కళాశాలలో స్పోర్ట్స్ మీట్

మేడ్చల్‌రూరల్: క్రీడలతోనే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత అన్నారు. కళాశాలలో స్పోర్ట్స్ టెక్–23 పేరిట ఇంట్రా కాలేజ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. శనివారం ముగింపు వేడుకల్లో ప్రిన్సిపాల్ పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చేస్తున్న ప్రిన్సిపల్ మాధవిలత

మొదటి నుంచీ అగ్ర నాయకులే..

- మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన మర్రి చెన్నారెడ్డి
- పునర్విభజనకు ముందు మేడ్చల్ ఎమ్మెల్యేలంతా మంత్రులే..
- విభజన తర్వాత మంత్రి ఒక్కరే ఆయనే.. మల్లారెడ్డి
- వందేమాతరం.. మర్రి చెన్నారెడ్డి.. దేవేందర్‌గౌడ్ వంటివారు
- మేడ్చల్‌కు ప్రాతినిధ్యం వహించిన వారే..


మేడ్చల్ నియోజకవర్గ చిత్రం

మేడ్చల్: ఉమ్మడి రాష్ట్రంలో మేడ్చల్ నియోజకవర్గం ఎంతో మంది ఉద్దండులను రాష్ట్రానికి అందించింది. మర్రి చెన్నారెడ్డి, దేవేందర్‌గౌడ్ వంటి రాజకీయ ప్రముఖులకు రాజకీయంలో నిలదొక్కుకునేలా మేడ్చల్ నిలిచింది. పునర్విభజనకు ముందు మేడ్చల్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలందరూ రాష్ట్రంలో మంత్రి పదవులు పొందినవారే. పునర్విభజనకు ముందు జీహెచ్ఎంసీతో కలిసి ఉండే నియోజకవర్గం ఉమ్మడి రాష్ట్రంలో ఖైరతాబాద్ తర్వాత అతి పెద్దదిగా మేడ్చల్ ఉండేది. మేడ్చల్, కూకట్‌పల్లి(కొంతభాగం) కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్(కొంతభాగం) నియోజకవర్గాలు కలిపి మేడ్చల్ నియోజకవర్గంగా ఉండేది. పునర్విభజన తర్వాత మూడు ముక్కలైంది.

◆ 1962లో ఏర్పడ్డ మేడ్చల్ నియోజకవర్గం మొదటి ఎన్నికల్లో స్వాతంత్ర్య సమరయోధుడు వందేమాతరం రాంచందర్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నాటి కాంగ్రెస్ యోధుడు కేవీ రంగారెడ్డిపై విజయం సాధించారు.

◆ 1967 నుంచి 72 వరకు ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో కాంగ్రెస్ అగ్రనేత సుమిత్రాదేవి రెండుసార్లు కాంగ్రెస్ నుంచి గెలిచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.

◆ 1978లో మర్రి చెన్నారెడ్డి మేడ్చల్ నుంచి బరిలోకి దిగి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. 1983లో దివంగత తెలంగాణ పోరాట యోధుడు గొడవెల్లికి చెందిన సింగిరెడ్డి వెంకట్రాంరెడ్డి సతీమణి ఉమాదేవి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎన్టీఆర్ హవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

◆ 1983లో జరిగిన ఉప ఎన్నికల్లో ఘట్‌కేసర్ మండలం కొర్రెములకు చెందిన కొమ్మురెడ్డి సురేందర్‌రెడ్డి టీడీపీ నుంచి బరిలో నిలబడి ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు.

◆ 1989లో జరిగిన ఎన్నికల్లో తిరిగి ఉమాదేవి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో నాటి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న తూళ్ల దేవేందర్‌గౌడ్‌కు ఎన్నికల ఆరు నెలల ముందే ఎన్టీఆర్ మేడ్చల్ టికెట్ ప్రకటించడంతో 1994, 1999, 2004లలో కాంగ్రెస్‌కు చెందిన సింగిరెడ్డి ఉమాదేవిపై, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిపై, టీఆర్ఎస్‌కు చెందిన సురేందర్‌రెడ్డిపై దేవేందర్‌గౌడ్ వరుసగా గెలిచారు. ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లలో రెవెన్యూ, బీసీ సంక్షేమం, హోంమంత్రిగా పనిచేసి, రాజశేఖర్‌రెడ్డి హయాంలో టీడీఎల్‌పీ ఉప నేతగా పని చేశారు.

◆ 2004లో పునర్విభజన తర్వాత కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి టీడీపీకి చెందిన నక్క ప్రభాకర్‌గౌడ్‌పై గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన మలిపెద్ది సుధీర్‌రెడ్డి టీడీపీకి చెందిన తోటకూర జంగయ్యపై ఎమ్మెల్యేగా గెలిచారు.

అందరికీ ఆశ్రయం ఇచ్చిన మేడ్చల్..

మేడ్చల్ ఓటర్లు ఏనాడూ స్థానిక స్థానికేతర భేదం లేకుండా అందరినీ రాజకీయంగా ఆదరించారు. మేడ్చల్ నుంచి 12 సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో ఉమాదేవి, సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలు మాత్రమే నియోజకవర్గానికి చెందిన వారు కాగా మిగతా వారు నియోజకవర్గంలో ఓటు హక్కు లేని నేతలే. ఇలా మేడ్చల్ రాష్ట్రానికి ఉద్దండ నాయకులను అందించడంతో పాటు చాలామంది నాయకులకు రాజకీయ భవిష్యత్‌ను అందించింది. ఆరుసార్లు ఓడిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని మొదటిసారి చట్టసభలకు పంపిన ఘనత మేడ్చల్ ఓటర్లదే.. పోటీలో తొలిసారి నిలిచిన దేవేందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉమాదేవి, మల్లారెడ్డి వంటి నాయకులకు రాజకీయ భవిష్యత్‌ను కల్పించిన ఘనత మేడ్చల్ ఓటర్లదే..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ చెక్‌పోస్ట్–గండిమైసమ్మ రోడ్డు శనివారం ఉదయం 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా సుతారిగూడ చెరువు వద్ద వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి



జవహర్‌నగర్: స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతిచెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో పెద్దినేని గణేష్, భార్య పావనిల కుమారుడు రిషిక్, కుమార్తె భవ్యశ్రీ(2.5)లతో కలిసి నివసిస్తున్నారు. వీరి కుమారుడు రిషిక్ జవహర్‌నగర్ రచన గ్రామర్ స్కూల్‌లో చదువుతున్నాడు. శనివారం ఉదయం రిషిక్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు తల్లితో వచ్చిన భవ్యశ్రీ ప్రమాదవశాత్తు అదే స్కూల్ బస్సు చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయింది. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మృతితో ఆనంద్‌నగర్ కాలనీవాసులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ప్రధానోపాధ్యాయురాలికి వీడ్కోలు



కాప్రా: కాప్రా జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహించిన బాలమణికి శనివారం కాప్రా జెడ్పీ స్కూల్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. 2018 జూలై నుంచి 2023 సెప్టెంబర్ వరకు కాప్రా జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా ఆమె సేవలందించారు. బదిలీపై ఆమె యాదాద్రి జిల్లా వాసాలమర్రి జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో ప్రధానోపాధ్యాయుడు రాము బదిలీపై వచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సుధాకర్



కుషాయిగూడ: ఆర్యవైశ్య సంఘం ఉప్పల్ మండల అధ్యక్షుడిగా మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన ఎర్రం సుధాకర్ గుప్తా నియమితులయ్యారు. శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మంచికంటి రాజవర్ధన్‌గుప్తా, బిక్కుమల్ల రమేష్‌గుప్తా, నేతి రాములు, నగేష్‌కుమార్, బచ్చు ప్రమోద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.